ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 17 నవంబరు , 2026 | పేజీలు : 7

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్

ఎమ్మెల్యే మందుల సామేల్

ప్రజాపక్షం/తుంగతుర్తి : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం చేయూత ఫించన్లు అందజేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలో తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల నూతన చేయూత ఫించన్ ప్రతాల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో ప్రతి ఒక్క వర్గానికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ వెంకన్న, తుంగతుర్తి సర్పంచ్ సాయిబాబా,



అన్నారం సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి, రైతు సహకార సంఘం చైర్మన్ గుడిపాటి సైదులు, తుంగతుర్తి మండల అధ్యక్షులు రేగటి రవి గౌడ్, మద్దిరాల మండల అధ్యక్షులు వెంకన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతకు

సమరశీల పోరాటాలు

శీతాకాల సమావేశాల్లోనే మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు నిర్ణయం తీసుకోవాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రజాపక్షం/నల్లగొండ: సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత సాధించే వరకు సమర శీల పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛ, సమానత్వం,సామాజిక న్యాయం,సమసమాజ స్థాపనే ధ్యేయంగా మహిళా లోకం ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. సోమవారం గిరి రమ అధ్యక్షతన నల్లగొండలో నిర్వహించిన భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ)జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నప్పటికీ రాజకీయ రంగంలో మాత్రం తగిన ప్రాతినిధ్యానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా ప్రస్తుత శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.మహిళలకు రాజకీయ అధికారంలో సముచిత వాటా దక్కినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ మహిళలు మానసికంగా,శారీరకంగా బలహీనులనే పితృస్వామ్య భావజాలాన్ని సమాజం నుంచి తొలగించాలని అన్నారు.దోపిడీ,పీడన,వివక్ష లేని సమసమాజ నిర్మాణంతోనే మహిళల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు.మోదీ ప్రభుత్వం మనుధర్మ భావజాలాన్ని ముందుకు తెస్తూ మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. శంలో ఆర్థిక, సామాజిక అసమానతలు పెరుగుతున్నాయని, సంపద,వనరులు,అధికారం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయని అన్నారు.విప్లవాల గడ్డ నల్లగొండ జిల్లాలో అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో మహిళా హక్కుల సాధనకు పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.డిసెంబర్ 13న నల్లగొండలో జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు నాయకులు వెల్లడించారు.డిసెంబర్ 27,28,29 తేదీల్లో ఖమ్మంలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విజయలక్ష్మి, షమీమ్,దుర్గమ్మ, శాంతి, కౌసల్య, సైదమ్మ, విజయ,సత్తమ్మ పాల్గొన్నారు.



పట్టభద్రుల పోలింగ్ కేంద్రాల జాబితా ఖరారు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ఖరారు చేసి ఎన్నికల సంఘానికి పంపించనున్నట్లు ఈఆర్వో, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ తెలిపారు వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల తుది జాబితా పైసోమవారం అయన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. కాగా గతంలో ఉప ఎన్నిక సందర్భంగా వరంగల్ ఖమ్మం నల్గొండ నియోజకవర్గంలో 605 పోలింగ్ కేంద్రాలు ఉండ గా, ప్రస్తుతం 894 కేంద్రాలకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని జిల్లాల నుండి ప్రతిపాదనలు అందాయని ,రాజకీయ పార్టీల ప్రతినిధుల సమ్మతితో ప్రతిపాదనలు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశానికి డిఆర్ఓ దశరథ్,రాజకీయ పార్టీల ప్రతినిధులు లింగస్వామి, పిచ్చయ్య, తెలు అన్న రవి, ముంతాజ్, ఎంఐఎం నుండి ప్రతినిధి హాజరయ్యారు.

ప్రతి కుటుంబానికి రూ.5లక్షల జీవిత బీమా

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్





ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం ద్వారా రూ.5లక్షల జీవిత భీమా కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. సోమవారం ప్రజావాణి అనంతరం ఆయన అధికారులతో ఇందిరమ్మ కుటుంబ భీమా పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కుటుంబంలో సంపాదించేం వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5లక్షల జీవిత భీమా అందించడం పథకం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న కుటుంబంలోని అర్హులైన సంపాదనపరుల్లో ఒకరిని భీమా కోసం ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. నామినీలను, భీమా మొత్తంలో వారి వాటాలను కూడా కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ఈ పథకం ద్వారా 3,29,934 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనున్నట్లు తెలిపారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 2,41,188 పట్టణ ప్రాంతాల్లో 88,746 కుటుంబాలు ఉన్నాయన్నారు. పథకం అమలులో పారదర్శకత పాటించాలని, అర్హుల వివరాలు, నామినీల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. నమో దు అనంతరం వివరాలను కుటుంబ సభ్యులకు చదివి వినిపించి, వారి అంగీకారంతో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

జనగణనలో ఒబిసిలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ బాక్సును కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఓబీసీలను మరోసారి మోసం చేసేందుకు బీజేపీ కుయుక్తులు పన్నుతోందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా పలు బీసీ సంఘాలు దశాబ్దాల కాలంగా చేస్తున్న పోరాట ఫలితంగా దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేసేందుకు ముందుకు వచ్చిందని అన్నారు. అయితే ఒకపక్క బీసీ కులగణన చేపడతామని చెబుతున్న బీజేపీ ప్రభుత్వం, జనగణన కోసం తయారు చేసిన 33 ప్రశ్నలతో కూడిన పత్రావళిలో 12వ ప్రశ్నగా ఏర్పాటు చేసిన కాలమ్‌లో నీవు ఎస్సీవా, ఎస్టీవా లేదా ఇతరులలో ఉన్నారా అని అడిగారే గాని ఓబీసీవా అనే కాలమ్ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. బీసీల జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో 50 శాతం నిధులు బీసీల అభివృద్ధి కొరకు కేటాయించాల్సి ఉండగా, కనీసం రూ.2 లక్షల కోట్లైనా విడుదల చేయాలని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో తగు రీతిలో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



ఫాసిస్టు విధానాలపై సమరభేరి

ఆర్ఎస్ఎస్-బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

వామపక్ష, ప్రజాస్వామిక, లౌకిక శక్తుల ఐక్య పోరాటమే ప్రత్యామ్నాయం: ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ధావలే

రైతాంగ ఐక్య పోరాటాలతోనే కేంద్ర విధానాలకు అడ్డుకట్ట: రైతు ఉద్యమ నాయకుడు రాకేష్ టికాయత్



ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పి కె. నరసింహ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. ప్రజలు అందించే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలు, తక్షణ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందన్నారు. ప్రజా రక్షణ కోసం పోలీస్ సిబ్బంది అనుక్షణం విధులు నిర్వర్తిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

చేయూత పెన్షన్ల పత్రాలు పంపిణీ



ప్రజాపక్షం/మునగాల: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన చేయూత పెన్షన్ల పత్రాలను ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో చేయూత పెన్షన్లను డిసిసి ప్రధాన కార్యదర్శి కాలే సామ్యేలు, ఉప సర్పంచ్ వేనేపల్లి శైలజ రమేష్‌బాబులు గీతకార్మికులకు, వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళల లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని నారాయణగూడెం గ్రామంలో చేయూత పెన్షన్లను సర్పంచ్ కాంపాటి వెంకన్న 49మంది లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఉప సర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, వార్డు సభ్యులు నరేష్, కళ్యాణి, కామేశ్వరి, కారింగుల సైదుల, కేసగాని వెంకన్న పాల్గొన్నారు.

పూర్వ వృత్తి విద్యపై అవగాహన

ప్రజాపక్షం/నేరేడుచర్ల: విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే వివిధ వృత్తులపై అవగాహన, ఆసక్తి ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించేందుకు సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ వృత్తి విద్య (ప్రీ వోకేషనల్ ఎడ్యుకేషన్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వృత్తిలకు చెందిన నిపుణులు ఎలక్ట్రిషియన్ యాదగిరి, ప్లంబర్ రవికుమార్, రైతు సిహెచ్ శ్రీను, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి తమ వృత్తులకు సంబంధించిన పనితీరు, ఉపయోగించే పరికరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వృత్తుల ప్రాధాన్యతను వివరించి, విద్యార్థులకు ఆచరణాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజావాణికి 9 వినతుల స్వీకరణ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 9 వినతులను స్వీకరించినట్లు మిర్యాలగూడ ఆర్డీవో ఎస్.రమణారెడ్డి తెలిపారు. సోమవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్ రమణారెడ్డి ప్రజల నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించి వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయానికి 2, అడవిదేవులపల్లి తహసీల్దార్ కార్యాలయానికి 1, నిడమనూరు తహసీల్దార్ కార్యాలయానికి 1, తిరుమలగిరి సాగర్ తహసీల్దార్ కార్యాలయానికి 1 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటితో పాటు మిర్యాలగూడ మున్సిపాలిటీకి 2, ఇరిగేషన్ ఈఈకి 1, మిర్యాలగూడ డిప్యూటీ డీఎం హెచ్ఓకు 1 చొప్పున మొత్తం 9 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. . ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/చిట్యాలఃు నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి గ్రామ పరిధిలో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పిరుదుల కుంటకు పిలాయిపల్లి కాలువ ద్వారా సాగు నీరు మళ్లించేందుకు ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ ఆవుల సుందరయ్యాదవ్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గ్రామస్థులు, రైతులతో కలిసి జిల్లా కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుందరయ్య మాట్లాడుతూ పిలాయిపల్లి కాల్వ ద్వారా పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని పెద్దచెరువుకు చేరుతున్న నీటిని ఫీడర్ ఛానల్ ద్వారా పిరుదుల కుంటకు నీటిని మళ్లించడం ద్వారా దిగువ ప్రాంతంలోని ఎర్రకుంట, పెద్ద చెరువులతో పాటు బోయగబ్బ, మొగిలిదొరి, తాళ్లవెల్లంల గ్రామాల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు ఆవుల మాధవి, వార్డు సభ్యులు పాకాల నర్సింహ్మా, పెర్క నాగరాజు, నాయకులు అందె రాములు, పల్లపు ప్రశాంత్, మెట్టు వెంకటేశం, ముక్కామల యాదయ్య, పెర్క కుమార్ ఉన్నారు.

పాఠశాలలకు మైక్ సెట్ల అందజేత



ప్రజాపక్షం/చిట్యాలఃు నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు దాస్ సేవా సమితి వారు సోమవారం మైక్ సెట్లను అందజేశారు. ప్రతి సంవత్సరం దాస్ సేవా సమితి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తుంది. ఇందులో భాగంగా సమితి సమన్వయకర్త, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చెన్నూరు నర్సింగరావు చొరవతో మండలంలోని బోయగుబ్బ, పిట్టంపల్లి, నేరడ, చిట్యాల, చిన్నకాపర్తి, గుండ్రాంపల్లి, నుంకెనపల్లి, తాళ్లవెల్లంల, పేరేపల్లి గ్రామాలలోని పిఎస్, యూపిఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మైక్‌సెట్లను సంఘ్వకరించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దాస్ సేవా సమితి అందించిన ఈ అవకాశాన్ని విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి ఉపయోగించుకుంటామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాభోదనతో పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ. 5లక్షల జీవిత బీమా

నవంబర్ 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమీ పథకం ప్రభుత్వం
ప్రత్యేక శిబిరాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ



ప్రజాపక్షం/చిట్యాలఃు రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం' ను ప్రారంభించనుంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి నవంబర్ 19 రోజు నుంచి ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. ఇందు కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది. కుటుంబాన్ని పోషించే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ. 5 లక్షల జీవిత భీమా పరిహారం అందించాలనేది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత భీమా సదుపాయం కల్పించడం ద్వారా సామాజిక భద్రతను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకం కింద కుటుంబాన్ని పోషించే 18 నుంచి 59 సంవత్సరాల వచస్సు గల సభ్యులను భీమా సదుపాయం కల్పించనున్నారు. లబ్ధిదారుల వయస్సు ధృవీకరణకు ఆధార్ కార్డును ప్రాథమిక ఆధారంగా తీసుకోనున్నారు. పథకం అమలులో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపిడివో కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కార్యాలయాల ద్వారా అవసరమైన సమాచారం అందించనున్నారు.



జిల్లా మానిటరింగ్ బృందం తనిఖీ

ప్రజాపక్షం/నేరుడుచర్ల: మండల పరిధిలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం జిల్లా మానిటరింగ్ బృందం సందర్శించి పాఠశాల విద్యా బోధన, నిర్వహణ తీరును పరిశీలించింది. ఈ సందర్భంగా అన్ని తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించడంతో పాటు మద్యాహ్న భోజన పథకం అమలును కూడా తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి బోధన పద్ధతులు, పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థిని, సమీన హింది పాఠ్యాంశంలోని స్వరాజ్‌కి నీమ్ అంశంలో ఝాన్సీ రాణి పాత్రను ఏకపాత్రాభినయం ద్వారా ప్రదర్శించగా, మానిటరింగ్ బృందం సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు జాఫర్, మండవ సైదులు, జానకిరాములు, ఆజంబాబా, ఉపేందర్, ఆనందభాస్కర్, సైదులు, బూర వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుట్లూరి సత్యనారాయణరెడ్డి, పందిరి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఓజెటి శిక్షణను సద్వినియోగం



ప్రజాపక్షం/నేరేడుచర్ల: వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు ఆన్‌జాబ్ ట్రైనింగ్ (ఓజెటి) ను సద్వినియోగం చేసుకొని, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.నీరజ సూచించారు. సోమవారం నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఓజెటి, ఎసిపి ఒకేషనల్ గ్రూపుల మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో కలిసి ఓజెటిలో భాగంగా స్థానిక తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థను సందర్శించారు. అనంతరం గిడ్డంగుల సంస్థ మేనేజర్ సఫియాబీ, సూపర్‌వైజర్ రాహుల్, గిడ్డంగుల నిర్వహణ, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు సూచించారు. అధ్యాపకులు వెంకటరమణ, వెంకన్న, శ్రీనివాసులు, ప్రసాద్, వీరు, ఆపర్ణ, వీరేష్, అన్వేష్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ఉద్యోగులందరికి భరోసా కల్పించే పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని టిపిఎస్ఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గోగుల నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని పంచాయితీ కార్యదర్శుల తరపున టిపిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జానయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత లేకుండా చేస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పున రుద్ధరించాలని కోరారు. కార్యదర్శులు జానయ్య, వెంకటలక్ష్మి, గీత, స్వప్న, సందీప్, విజయ్, సంజయ్ పాల్గొన్నారు.

పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; నేడు నూతనంగా మంజూరు అయిన చేయూత పెన్షన్ పత్రాలను లబ్ధిదారులకు మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు డిసిసి ప్రధాన కార్యదర్శి ఊట్కూరి వేమన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్ మంజూరు అయిన మండల పరిధిలోని అన్ని గ్రామాల లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వేమన్‌రెడ్డి కోరారు.



ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రాధాన్యత

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ ; ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) రూ.2,45,216 విలువైన చెక్కులను పట్టణంలోని ఆయన గృహంలో లబ్ధిదారులకు అంద జేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబా లకు అండగా నిలవడం మా బాధ్యతన్నారు. ప్రతి అవ సరమైన కుటుంబానికి సకాలంలో సాయం అందేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్ర మంలో నాయకులు పిల్లల రమేష్ నాయుడు, ధర్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా మద్ధతు ధర పొందాలి



ప్రజాపక్షం/చింతలపాలెం ; సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రంలో రైతులు పండించిన పత్తి పంటను అమ్ము కొని ప్రభుత్వ మద్ధతు ధర పొందాలని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ దేశముఖ్ రాధిక అరుణ్ కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని భారతమ్మ కాటన్ మిల్లులో కాటన్ కార్పో రేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు తాము ఎంతో కష్టపడి పండించిన పత్తి పంటను ప్రైవేట్ వ్యక్తులకు, దళారులకు తక్కువ ధరకు అమ్ము కొని నష్టపోవద్దన్నారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐ కొనుగోలు కేంద్రా లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్య క్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అరుణ్ కుమార్ దేశముఖ్, మార్కెట్ సెక్రటరీ వి. నరసింహ, సిసిఐ అధి కారులు రాజశేఖర్ రెడ్డి, మధు రెడ్డి, కాకునూరి రాంరెడ్డి, మార్కెట్ సిబ్బంది జానకిరత్నం, లిం గయ్య, సుధాకర్, రైతులు సంజీవ రెడ్డి, నలీమ్ పాల్గొన్నారు.

బోరు మోటార్ అందజేత

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; మండల పరిధిలోని దోని యాల గ్రామంలో పూరాతన కాలం నుండి ఉన్నటు వంటి శివాలయంను ఇటీవల గ్రామస్థులంతా కలిసి అభివృద్ధి చేస్తున్నారు. శివాలయంకు సంబంధించి మంచి నీటి సమస్యను తీర్చేందుకు గుత్తా వెంకట్‌రెడ్డి కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా ఆల యంకు బోరు మోటార్‌ను అందజేశారు. ఆలయ అభి వృద్ధికి సహకరించినందుకు గ్రామస్థులు గుత్తా వెంకట్ రెడ్డికి కృతజ్ఞత తెలిపి శాలువాతో ఘనంగా సన్మానిం చారు. ఈకార్యక్రమంలో వరికుప్పల వెంకటయ్య, దాసరి యాదగిరి, గోగుల నర్సింహా, బోడ నాగార్జున, దాసరి సత్యనారి, కృష్ణయ్య,పాండు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి సముచిత గుర్తింపు, గౌరవం



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ ; కాంగ్రెస్ పార్టీ పట్ల నమ్మకంతో పార్టీలో చేరుతున్న నాయకులు, కార్యకర్త లకు సముచిత గుర్తింపు, గౌరవం ఉంటాయని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణం లోని విద్యానగర్ కార్యాలయంలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పంగరేక సంజయ్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయన్నారు. దీంతో అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజాసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి కుందమల్ల శేఖర్, మార్కెట్ కమిటి డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా మాల మహానాడు అధ్యక్షులు బొల్లెద్దు వినయ్, జిల్లా పార్టీ నాయకులు సాజిద్ ఖాన్, వెన్న ఉపేందర్, కత్తి వెంకన్న, కోడి కిరణ్, నర్సింగ్ కిరణ్, షేక్ గౌస్ పాషా, పిల్లల నాగ రాజు యాదవ్ పాల్గొన్నారు.

మిల్లుపై చర్యలు తీసుకోవాలని వినతి



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ ; ధాన్యం కొనుగోలు విష యంలో రైస్ మిల్లు యాజమాన్యం అక్రమ తరుగు, అనధికారిక కోతలతో రైతులను నిలువునా దోచుకుం టుందని ఆరోపిస్తూ మండలంలోని గుడిబండ తండకు చెందిన భూక్య వీరేందర్ నాయక్ సోమ వారం ప్రజావాణిలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధితుడు మీడియాతో మాట్లాడుతూ నవంబర్ 3న మాచారం గ్రామంలోని గౌరీ శంకర్ రైస్ మిల్లులో 28 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించినట్లు తెలిపారు. క్వింటాకు రూ.3,700 ఇస్తామని నమ్మించిన మిల్లు యాజమాన్యం, రసీ దులో మాత్రం రూ.3,650 మాత్రమే నమోదు చేసిం దన్నారు. డబ్బులు ఇచ్చే రోజు పూర్తి మొత్తం ఇస్తా మని చెప్పి, తీరా ఇప్పుడు అడిగితే అసభ్య పదజా లంతో దూషిస్తూ అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా 28 క్వింటాళ్లకు 30 కేజీల అదనపు తరుగు, నూటికి రూ.1.50 సిసి కటింగ్, హమాలీ రూ.400, వే బ్రిడ్జి రూ.100, గుమస్తా రుసుం రూ.80, ట్రాక్టర్ మామూలు రూ.60 చొప్పున అక్రమంగా వసూలు చేశారని వాపోయాడు. తులను మోసం చేస్తున్న రైస్ మిల్లుపై, వే బ్రిడ్జిపై పూర్తిస్థాయి విచారణ జరిపి తనకు రావాల్సిన న్యాయబద్ధమైన డబ్బులను ఇప్పిం చడంతోపాటు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసు కోవాలని అధికారులను కోరారు.

అకాల మరణాల నివారణకు ప్రత్యేక శాంతి పూజలు

ప్రజాపక్షం/చిట్యాల; పట్టణంలో గత కొద్ది రోజు లుగా చోటు చేసుకుంటున్న వరుస మరణాల నేప థ్యంలో ప్రజల్లో నెలకొన్న ఆందోళనను దృష్టిలో ఉంచుకుని, పట్టణ ప్రజల మనోభావాలకు అనుగు ణంగా ప్రత్యేక శాంతి పూజా కార్యక్రమాలు నిర్వ హించాలని నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి పాలకవర్గం నిర్ణయించింది. ఈ సందర్భంగా మున్సి పల్ చైర్‌పర్సన్ గీతారమేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన అఖిల పక్ష నాయకుల సమావేశంలో పురోహితులు శ్రీ దౌలతా బాద్ వాసుదేవ శర్మ, శాస్త్రేయ పూజారి నాగిళ్ల లక్ష్మ ణరావు పూజా కార్యక్రమాల వివరాలను వెల్లడించా రని ఆమె పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నవంబర్ 18 బుధవారం రోజున పట్టణ పరిధిలోని 65 ఆలయాలను శుభ్రపరిచి, దీపారాధన అనంతరం నాగిళ్ల లక్ష్మ ణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక శాంతి పూజలు నిర్వహించనున్నారు. నవంబర్ 19 గురువారం రోజున ఉదయం పట్టణంలోని బొడ్రాయి దగ్గర అకాల మృత్యు నివారణ హోమం, శాంతి పూజ లను పురోహితులు వాసుదేవశర్మ, లక్ష్మ ణరావులు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. నవంబర్ 20 శుక్రవారం పట్టణ ప్రజలు వనవాసానికి వెళ్లాలని తెల యపరిచారు. వివాదాలు తలెత్తకుండా ప్రశాంతంగా వివాహరహితంగా పూజా కార్యక్రమాలను నిర్వహిం చుకోవాలని గీతారమేష్ ప్రజలను కోరారు.

దేవుడు ఆశీస్సులు అందరిపై ఉండాలి



ప్రజాపక్షం/చండూరు; దేవుడు ఆశీ స్సులు అందరిపై ఉండాలని , దేవుడు కొందరివాడు కాదు అందరివాడు అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్‌రెడ్డి అన్నారు. చండూరులో నూతనంగా నిర్మించే శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ప్రతిష్టా కార్యక్ర మంలో అయ్యప్ప దీక్షలో సతీసమే తంగా కలిసి సోమవారం యంత్ర ప్రతిష్ట ,విగ్రహ ల క్రతువులో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమం ,ధ్వజస్తంభ పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆల యంలో ప్రతిష్టించిన అయ్యప్ప స్వామిని దర్శించు కొని మొక్కులు చెల్లించుకున్నారు. చండూరులో శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయాన్ని పూర్తి చేసుకోవడం సంతోషకరమన్నారు. గుడి నిర్మా ణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిని అభినందిం చారు. నూతనంగా అంగరంగ వైభవంగా నిర్మాణం చేసుకున్న శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవాలయానికి నా వంతు సహాయంగా 30 లక్షలు సహాయం చేస్తు న్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో గుడి నిర్మాణ కమిటీ చైర్మన్ , చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు , మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , కాంగ్రేస్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి , కోడి గిరి బాబు , సరికొండ వెంకన్న , అనంత చంద్రశేఖర్ , దోటి వెంకటేష్ యాదవ్ , వెంకటేశ్వర్లు , మల్లేశం , రమణ గురుస్వామి , కట్ట అంజయ్య పాల్గొన్నారు.



వ్యాపార రంగంలో యువత రాణించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ ; యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని స్వశక్తితో ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ అన్నారు. ఆది వారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భూమిరెడ్డి ఆసుపత్రి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన యశస్వి ఎంటర్‌ప్రైజెస్ వాటర్ ప్రూఫింగ్ షాపును వారు ప్రారంభించి మాట్లాడారు. నూత నంగా వ్యాపారం ప్రారంభించడం అభినందనీయమని, వినియోగ దారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాల న్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు, మాజీ డిసిసిబి డైరెక్టర్ ముదిరెడ్డి రమణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్, స్థానిక కౌన్సిలర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/చండూరు; మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం చండూరు వ్యవ పాయ మార్కెట్ కమాటీ చైర్మన్ ,గ్రామ సర్పంచ్ ముక్కాంల వెంకన్న యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొను గోలు కేంద్రాన్ని పరిసర ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవా లని అన్నారు. మధ్య దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొని మద్ధతు ధరను పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీపిఎం యాదయ్య , ఉప సర్పంచ్ సిహెచ్ ఊషయ్య , మాజీ రైతు సేవా సహకారం సంఘం చైర్మన్ బొబ్బల శ్రీనివాస్ రెడ్డి , ఐకెపి సెంటర్ నిర్వాహకులు యాదయ్య , అంజయ్య ,లక్ష్మీ పాల్గొన్నారు.

పంది శ్రీను సేవలు చిరస్మరణీయం

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామ మాజీ సర్పంచ్ భర్త, కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకుడు, ఎంఆర్‌పిఎస్ నాయకుడైన స్వర్గీయ పంది శ్రీను ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయం అయినవని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. పంది శ్రీను మరణించి సోమవారం రోజు సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా చింతకుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ బాలు నాయక్ ముఖ్య అతిధిగా హాజరై మట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఎంఏ సిరాజ్‌ఖాన్, మండల అభివృద్ధి ప్రధాత దూదిపాల శ్రీధర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి ఊట్కురి వేమన్‌రెడ్డి, మేకల రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్‌యాదవ్, తిప్పర్తి రుక్మారెడ్డి, ఎర్ర కృష్ణ జాంబవ్, సర్పంచ్‌లు పసునూరి యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.





నా పేరు కలాం సినిమా ప్రదర్శన

ప్రజాపక్షం/మర్రిగూడ : జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా నా పేరు కలాం అనే ప్రేరణాత్మక సినిమాను ప్రదర్శించారు.ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సినిమా పేదరికాన్ని అధిగమించి ఉన్నత లక్ష్యాలను సాధించాలనే తపన ఉన్న ఒక చిన్న బాలుడి కథ అని వివరించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం గారి జీవిత ప్రేరణతో ఆ బాలుడు తన పేరును కలాంగా మార్చుకుని,గొప్ప వ్యక్తిగా ఎదగాలని కలలు కంటాడు. ఉపాధ్యాయులు వై. మంజులత,అమీనా,పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతూ ప్రజాప్రతినిధిగా కొనసాగడంపై ఫిర్యాదు



ప్రజాపక్షం/మర్రిగూడ: మండలంలోని తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన అయితపాక కల్పన ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతూనే,గ్రామ వార్డు సభ్యురాలిగా ప్రజాప్రతినిధి హోదాలో కొనసాగుతున్నారని ఆరోపిస్తూ మండల బీజేపీ అధ్యక్షుడు పాట్ల లావత్ రాజేందర్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.మహిళా సమాఖ్య,బిజినెస్ డెవలప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కొనసాగుతూ ప్రభుత్వ లబ్ధి పొందుతున్న ఆమె ప్రజాప్రతినిధిగా కొనసాగడం నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి.సి. మున్నయ్యను కోరారు.

మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/మర్రిగూడ: ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులకు చాలీచాలని వేతనాలతో వెట్టి చేయిస్తున్నారని అన్నారు.సమాన పనికి సమాన వేతనం ఉండాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనియెడల మిషన్ భగీరథ కార్మికులతో సమ్మె చేస్తామని వారు హెచ్చరించారు. గ్యార కాశయ్య పాల్గొన్నారు.



క్రీడలతో విద్యార్థులలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో గల మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించిన 2026/27 విద్యా సంవత్సరపు జిల్లాస్థాయి క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అండర్14, అండర్17, అండర్19 విభాగాల్లో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని చాటుకున్నారు. అనంతరం



వివిధ క్రీడా విభాగాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎం ఇందిర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ ఉప్పు నగేష్ హెచ్చరించారు. సోమవారం తెల్లవారుజామున యాదగిరిపల్లి గ్రామ శివారులో ఆయన తన సిబ్బందితో కలిసి ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా కామేపల్లిగూడెం మూసీ వాగు నుంచి మిర్యాలగూడ వైపు దొంగతనంగా ఇసుకను తరలిస్తున్న 2 ట్రాక్టర్లను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు మండల పరిధిలో నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన వాహనాల వివరాలను ఎస్ఐ ఉప్పు నగేష్ తెలియజేస్తూ మొదటి ట్రాక్టర్ డ్రైవర్ నారబోయిన సతీష్, యజమాని ఉత్తర్ల గోపు కాగా, రెండవ ట్రాక్టర్ డ్రైవర్ నల్లమేకల చందు, యజమాని సల్లోజు సతీష్ అని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ఈ నలుగురిపై కేసు నమోదు చేసి, 2 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు అన్నారు. సీజ్ చేసిన ఈ ట్రాక్టర్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నల్గొండ జిల్లా మైనింగ్ అధికారి వద్దకు పంపనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/మర్రిగూడ : మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో భూగర్భ జలాలు పెంపొందించే దిశగా ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.గ్రామ సర్పంచ్ లపంగి నర్సింహా ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ లపంగి నర్సింహా మాట్లాడుతూ ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,500 చొప్పున ఆర్థిక సహాయం మంజూరు చేస్తోందని తెలిపారు.నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,గ్రామంలో ఇంకుడు గుంతలు లేని వారందరూ ప్రభుత్వం కల్పిస్తున్నఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప



సర్పంచ్ పొగాకు పెద్ద సైదులు,కాంగ్రెస్ మండల జనరల్ సెక్రటరీ రాగుల రాములు,వార్డు సభ్యులు భీమనగోని మల్లమ్మ యాదయ్య,ఫీల్డ్ అసిస్టెంట్ సల్వోజ్ యాదయ్య, పగిళ్ల యాదమ్మ శంకర్, కొత్త లింగస్వామి,లపంగి మహేందర్,కడారి ఎర్రయ్య, పగిళ్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

విరమణ ప్రయోజనాలపై 10 శాతం వడ్డీ చెల్లించాల్సిందే

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఉద్యోగ విరమణ ప్రయోజనాల చెల్లింపు విషయంలో ఆలస్యం జరిగితే 10 శాతం వడ్డీ చెల్లించాల్సిందేనని రిటైర్డ్ ఉద్యోగికి అనుకూలంగా హైకోర్టు కీలక తీర్పు వెలువరించిందని టాప్రా జిల్లా అధ్యక్షులు నూకల జగదీష్ చంద్ర తెలిపారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కోర్టు ఉత్తర్వులలో పేర్కొన్న గడువులోగా కక్షిదారుకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు చెల్లించనందున, మొత్తం ప్రయోజనాలపై 10 శాతం వడ్డీని సదరు రిటైర్డ్ ఉద్యోగికి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిందని అన్నారు. ఆ వడ్డీ మొత్తాన్ని మూడు వారాల్లోగా కక్షిదారుకు అందించాలని, లేనిపక్షంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా తమ ఎదుట ప్రత్యక్షంగా హాజరుకావాలని కోర్టు ఉత్తర్వులలో పేర్కొన్నట్లు తెలిపారు.కామారెడ్డికి చెందిన రిటైర్డ్ ఎస్సై బేతి కోనారెడ్డి 2024 డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ చేశారని, ఏడాది గడిచినా తనకు రావాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందకపోవడంతో ఆయన గత ఫిబ్రవరి 23న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని అన్నారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం, ఆరు వారాల్లోగా పిటిషనర్‌కు సంబంధించిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను పూర్తిగా చెల్లించాలని, లేకపోతే రిటైర్ అయినప్పటి నుంచి చెల్లింపు తేదీ వరకు 10 శాతం వడ్డీతో కలిపి ఇవ్వాలని తీర్పు వెలువరించిందని తెలిపారు. ఈ సమావేశంలో టాప్రా నాయకులు పులి కృష్ణమూర్తి, లక్ష్మీ నారాయణ, దీకొండ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికా రంగం పాత్ర కీలకం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా ఎంతో కీలక పాత్ర పోషిస్తోందని, సమాజంలోని అనేక సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల కృషి ఎంతో గొప్పదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. సోమవారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవాలను తెలియజేస్తూ, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక వారధిగా నిలుస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి జర్నలిస్టులు చేస్తున్న నిస్వార్థ సేవలు అభినందనీయమని తెలిపారు.ముఖ్యంగా సమాజంలో వివక్షకు గురవుతున్న అణగారిన వర్గాలు, బడుగు, బలహీన వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో మీడియా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, జర్నలిస్టులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై విచారణ చేపట్టాలి



ప్రజాపక్షం/నాంపల్లి : మండలం పసునూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని పసునూరు నుండి నామనాయక్ తండా,వెంకటంపేటకు వెళ్లే రహదారి పక్కన ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి.ఈ మేరకు జాతీయ అంబేద్కర్ యువ కేంద్రం అధ్యక్షుడు గాలెంక గురుపాదం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు సోమవారం నాంపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ శర్మకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాంపల్లి మండల పరిధిలోని పసునూరు రెవెన్యూ గ్రామ పంచాయతీ శివారులో ఏర్పాటు చేసిన వెంచర్‌లో,10 శాతం భూమిని ప్రజా ప్రయోజనాల నిమిత్తం ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ పంచాయతీ అవసరాల కోసం కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైనట్లు ఆరోపించారు.

చట్ట ప్రకారమే భూములకు హద్దులు



ప్రజాపక్షం/మర్రిగూడ :మండలంలోని బట్లపల్లి గ్రామంలో భూముల రీసర్వేపై జారీ చేసిన నోటీసులకు వచ్చిన అభ్యంతరాల పరిష్కారానికై సోమవారం నిర్వహించిన గ్రామ సభకు చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి హాజరయ్యారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్ట ప్రకారమే భూములకు హద్దులు నిర్ణయించడం జరుగుతుందని,ఇంకా ఎవరైనా రీసర్వే వ్యత్యాసాలపై అభ్యంతరాలు ఉన్నట్లయితే గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. గ్రామంలో మొత్తం 356 ఖాతాలు ఉండగా, 388 ల్యాండ్ పార్సిల్ మ్యాపులు (ఎల్‌పిఎం)లు ఉండగా,19 అభ్యంతరాలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.సాధ్యమైనంత వరకు అభ్యంతరాలను తగ్గించుకునేలా రైతులు చూడాలని, ప్రస్తుత అభ్యంతరాలకు 60 రోజుల వ్యవధి ఉన్నదని, దానిని రానున్న రోజులలో అభ్యంతరాల స్వీకరణకు కేవలం 25 రోజుల గడువు మాత్రమే ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు,సర్పంచ్ భిక్షమయ్య,సర్వేయర్ పాల్గొన్నారు.

మంజూరు పత్రాల పంపిణీ

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని అన్ని గ్రామాలలో నూతనంగా మంజూరు అయిన చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మండల కేంద్రంలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య చేతుల మీదుగా పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణి చేయనున్నట్లు సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్తా తెలిపారు. సర్పంచ్‌లు నాగిరెడ్డి, కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంపి కిరణ్‌కుమార్ రెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాపక్షం/దేవరకొండ; భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నాయనమ్మ చామల రంగనాయ కమ్మ దశదిన కర్మ కార్యక్రమం సోమవారం శాలిగౌరారం మండలంలో జరిగింది. ఈకార్యక్రమంలో హాజరైన దేవర కొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ చామల రంగనాయ కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ బాలునాయక్ వెంట డిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతి నేని వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ప్రభుత్వం స్పందించి ఇంటి స్థలాలు ఇవ్వాలని మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ సభ్యులు సోమవారం జిల్లా అధి కారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాలుగా ఇంటి స్థలాల కోసం ఎదురుచూస్తున్నా తమ గోడు పట్టించుకునే వారే కరు వయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వం పేద లకు ఇంటి స్థలాలు ఇవ్వాలనే ఉద్ధేశంతో భూమిని కొను గోలు చేసిందని ఆ భూమిని నేటికి అర్హులైన నిరుపేదలకు కేటాయించకపోవడంతో ఎన్నో కుటుంబాలు నిరాశ్రయు లుగా మిగిలిపోయామని వాపోయారు. అధికారులు ఇప్పటి కైనా మానవతా దృక్పదంతో స్పందించి గతంలో కొనుగోలు చేసిన భూమి వివరాలను పరిశీలించి అర్హులైన నిరుపేదలను గుర్తించి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితాను రూపొందిం చాలని కోరారు.

చెరువుల నుండి అక్రమంగా నీటిని తరలిస్తే చర్యలు

ప్రజాపక్షం/డిండి; డిండి (గుండ్లపల్లి)మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్నటువంటి చెరువుల నుండి అక్రమంగా మోటార్లు బిగించి, పైప్‌లైన్ల ద్వారా నీటిని తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల తహశీల్దార్ హెచ్. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమ వారం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువుల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన మోటార్లు, పైప్‌లైన్లను సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. సంబంధిత రైతులు ఎవరూ చెరువుల నుండి అక్ర మంగా నీటిని తరలించకుండా నిబంధనలను పాటించాలని ఎవరైనా చెరువుల నుండి మోటార్‌ల ద్వారా నీటిని తరలిస్తు న్నారో తక్షణమే మోటార్‌లను తొలగించాలని లేని యెడల కఠిన చర్యలుంటాయని అన్నారు. ఈసమావేశంలో మండల వ్యవసాయ అధికారి రేహానా, విద్యుత్ శాఖ నారాయణ సింగ్ పాల్గొన్నారు.



దాతృత్వాన్ని చాటుకున్న సత్యమేవ జయతే సేవా సమితి



ప్రజాపక్షం/కోదాడ: సత్యమేవ జయతే సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాదెళ్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో దేవాలయాల వద్ద, వివిధ కూడలి వద్ద బస్టాండ్‌లో ఉంటున్న యాచకులకు దుప్పటి, మంకి క్యాప్, బుట్ట, భోజనం పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా సీనియర్ వైద్యులు జాస్తి సుబ్బారావు సత్యాన్వేషన్ మండలి వ్యవ స్థాపక అధ్యక్షులు సురేంద్రబాబు లు పాల్గొని యాచకులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాదెళ్ల బాలకృష్ణ సత్యమేవజయతే సేవా సమితిని స్థాపించి ఆ సేవా సమితి ద్వారా కోదాడ పరిసర ప్రాంతాల్లో ఎన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చలికి యాచకులు ఇబ్బంది పడుతున్నారని గమనించి వారికి దుప్పట్లు, మంకి క్యాప్, ఒక రోజు భోజనం ఏర్పాటు చేయడం దానికి మేము రావడం మాకు సంతో షంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, నాదెళ్ల సత్య, అనంతలక్ష్మి, నాగేశ్వరరావు, పుష్యమి, రహీం పాల్గొన్నారు.

హోటల్ నిర్మాణంపై విచారణ చేపట్టాలి



ప్రజాపక్షం/చిట్యాలఃు నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ పంచాయతి పరిధిలో 65వ నెంబర్ జాతీయ రహదారిని ఆనుకుని నిర్మి స్తున్న భారీ హోటల్ భవన నిర్మాణంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆసరా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మేడి హరికృష్ణ జిల్లా కలె క్టర్‌ను విజప్తి చేశారు. సోమవారం జరిగిన ప్రజా వాణి కార్యక్రమంలో ఈ విషయమై వినతి పత్రా న్ని అందజేశారు. హైవే పక్కన నిర్మిస్తున్న హోటల్ భవన నిర్మాణానికి సంబంధించి గ్రామ పంచా యతీ నుండి తీసుకున్న అనుమతులు, నిర్మాణా నికి అనుమతించిన అంతస్థులు, నిర్మా ణం నిబం ధనలకనుగుణంగా జరుగుతుందా తదతర విష యాలపూ సమగ్ర విచారణ చేపట్టాలని వినతి పత్రంలో కోరారు. సదరు హోటల్ నిర్మాణానికి సంబంధించిన అనుమతుల పత్రాలు, చెల్లించిన ఫీజుల వివరాలు, గ్రామ పంచాయతీకి వచ్చిన ఆ దాయ వివరాలను ప్రజలకు వెల్లడించాలన్నారు.

రైతుల ఆగ్రహ సునామీలో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయం



ప్రజాపక్షం/దేవరకొండ; కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ లను అమలు చేయకుండా మాటల గారడిలతో కాలయాపన చేస్తోందని దేవరకొండ మాజీ ఎంఎ ల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గుడిపల్లి మండలం కేశంనేనిపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు మాజీ ఎంఎల్‌ఏ రవీం ద్రకుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డమైన హామీలు, అసత్య ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మ రించి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాలు, విమర్శలు పక్కనబెట్టి ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెలుగురి వల్లపురెడ్డి, నర్సింహా, సర్పంచ్‌లు రాజశేఖర్‌రెడ్డి, శ్రీను, రాజేందర్‌రెడ్డి, పరమేష్, యాదగిరి, మహేందర్, కృష్ణారెడ్డిద, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విబి జీ రాంజీ పనులలో జరుగుతున్న జాప్యంపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/నేరేడుగొమ్ము; నల్గొండ జిల్లా నేరేడుగొమ్ము మండల పరిధిలో గ్రామీణ ఉపాధి హామీ పథకం (విబి జీ రాంజీ) ద్వారా అమలు చేయాల్సిన వివిధ అభివృద్ధి, వ్యక్తిగత ప్రయోజన పనుల విషయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అర్హులైన రైతులు, గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారు లకు సకాలంలో ప్రయోజనాలు అందించాల్సి ఉన్నప్పటికి క్షేత్రస్థాయిలో పలు అవకతవకలు జరుగుతున్నట్లు, కొత్త జాబ్ కార్డుల కోసం దర ఖాస్తు చేసుకున్నప్పటికి వాటిని సకాలంలో మంజూరు చేయకపోవడంతో పాటు ఒక్కో కార్డుకు రూ. 1,000 చొప్పున డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ఇంకుడు గుంతలు, ఎస్‌బిఎం పథకం కింద వ్యక్తిగత మరుగుదొడ్లు, పశువుల నీటి తొట్లు, బోర్‌వెల్ పాయింటు పనుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన రైతులకు గ్రామ పంచాయతీ తీర్మానాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, రాజకీయ కక్షతో కొంత మందికి తీర్మానాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాల ప్రయోజనాలు అందాల్సిన ఉండగా క్షేత్రస్థా యిలో జాప్యం కారణంగా రైతులు నష్టపోతున్నా రని తక్షణమే జరుగుతున్న డబ్బుల వసూళ్ళు, జాప్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమ వారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో స్థానిక ఎంపిడిలోకు భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి బొమ్ము రామాంజనేయులు వినతి పత్రం అందజేయడం జరిగింది.



సిఎం సహాయనిధి వరం

ప్రజాపక్షం/హాలియా: ముఖ్యమంత్రి సహాయ నిధి పొందిన లబ్ధి దారులు వాటిని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని మెరుగుపర చుకోవాలని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు. సోమ వారం హాలియా మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదా రులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు,బొంగరాల యేసు రాజు, పిల్లి ఆంజనేయులు,మజాహర్,న్యాయవాది కొమ్మన బోయిన చంద్రశేఖర్,నకిరేకంటి సైదులు,ఎడవెల్లి విజయ్ తదిత రులు పాల్గొన్నారు.

రూ. 5.49 కోట్ల పనులపై సామాజిక తనిఖీ

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: మండల పరిధిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన రూ. 5.49 కోట్ల విలువైన పనులపై 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడిం చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది , సోషల్ ఆడిట్ బృందంతో కలిసి ప్రత్యేక కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లా డుతూ నాలుగో నెల ఒకటి తారీకు 2025, నుంచి 31 మూడవ నెల 2026 వరకు మండలంలో జరిగిన పనులకు సంబంధించి పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో వేత నాల కింద రూ. 3 కోట్ల 90 లక్షలు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 1 కోటి 60 లక్షలు కలిపి మొత్తం రూ. 5 కోట్ల 49 లక్షల నిధుల వినియోగంపై ఆడిట్ జరగనుందని వివరించారు. తనిఖీ బృందాలకు క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి స్థాయిలో రికార్డులు అందించి సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీవో లింగంపల్లి నర్సయ్య, ఈసీ రాజశేఖర్, ఎస్ఆర్పీ అజ్మీరా రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, బీఆర్పీలు ఫీల్ అసిస్టెంట్లు, మేట్స్ , వీఆర్పీలు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్

ప్రజాపక్షం/నాంపల్లి : బిఆర్ఎస్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్య క్షుడిగా నాంపల్లి సర్పంచ్ నక్క చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.సోమ వారం సర్పంచ్‌లు సమావేశమై ఏకగ్రీవంగా ఆయనను ఎన్నుకు న్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లు అవమానాలకు గురవుతున్నారని, తమ కు సమాచారం ఇవ్వకుండానే ఇందిరమ్మ ఇళ్లు, చేయా త పింఛన్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. తమ హక్కుల సాధనకు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు.ఈ కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడపు నరసింహారావు,సర్పం చ్‌లు కడారి (శ్రీశైలం యాదవ్,నడింపల్లి (శీలక్ష్మి యాదయ్య,పల్లె వెంకన్న,సాగర్ల యాదయ్య,దామెర శోభ సహదేవ్,పెరికేటి రమేష్,పలువురు ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తా

ప్రజాపక్షం/కోదాడ: ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు పైడిమర్రి నారాయణరావు తెలిపారు. సోమవారం కోదాడ పట్టణంలోని కోదండరామలయంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు నూతన కార్యవర్గ అధ్యక్షులు పైడిమర్రినారాయణరావు, కోశాధికారి గాదంశెట్టి శ్రీనివాసరావు తో పాటు కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరి మాశెట్టి అనంత రాములు, పైడిమర్రి సత్యబాబు, నీలా సత్యనారాయణ, ఓరుగంటి బ్రహ్మం, ఇమ్మడి రమేష్, వెంకటనారాయణ, చారుగండ్ల రాజశేఖర్, యాదా రమేష్, మేళ్లచెరువు కిషోర్ పాల్గొన్నారు.



ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రజాపక్షం/డిండి; ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమై సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున యాసంగిలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి రెహానా రైతులకు సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ రైతులందరూ వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలను వీలైనంత వరకు నివారించాలని వరి పంటకు బదులుగా నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటలు తక్కువ నీటి అవసరమయ్యే పంటలు పెసర, మినుము, శనగ, కంది, వేరుశనగ, నువ్వులు, ఆముదం, జొన్నలు, కూరగాయలు వంటి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు.

దివ్యకు పీహెచ్‌డీ పట్టా



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధకురాలు కొమిరిశెట్టి దివ్యకు పీహెచ్‌డీ పట్టా లభించింది.ఆచార్య వసంత మిట్టపెల్లి పర్యవేక్షణలో ఆమె సమర్పించిన స్టడీస్ ఆన్ బయోయాక్టివ్ నైట్రోజన్ హెటెరోసైకిల్స్ : సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ (ఆక్సజోల్2ఐల్) పిరిమిడిన్ అనలాగ్స్ అనే పరిశోధనా సిద్ధాంత గ్రంథానికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది.ఈ పరిశోధనలో భాగంగా దివ్య కొత్త ఆక్సజోల్‌పిరిమిడిన్ అనలాగ్‌లను సంశ్లేషణ చేసి,వాటి జీవక్రియాశీలతను పరిశీలించారు.ఈ సందర్భంగా దివ్యను విశ్వవిద్యాలయ ఉపకులపతి, రిజిస్ట్రార్, పరిశోధన పర్యవేక్షకురాలు ప్రొఫసర్ వసంత మిట్టపెల్లి, అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఎంజియు జట్టు ఎంపిక



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల తైక్వాండో చాంపియన్‌షిప్‌లో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక పూర్తయింది. జట్టుకు పిట్టల మధు,తుపాకుల నరేందర్,ఎండీ బషీరుద్దీన్, బుతరాజు ఆదిత్య, నల్లబెట్టి మనోజ్, గజ్జెల్లి సర్వ మాధవ్ జిత్, పిడుగు ఉదయ్ కిరణ్ ఎంపిక య్యారు.ఎంపిక కార్యక్రమంలో విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ మద్దిలేటి పసుపుల,డాక్టర్ ఆర్. మురళి, డాక్టర్ వై. శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.జ్యూరీ సభ్యుడిగా పవన్, ఎంపిక కమిటీ సభ్యుడిగా రెడ్యానాయక్ వ్యవహరించారు.

కార్తీక మాసం పూజలు

ప్రజాపక్షం/నాంపల్లి :మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలతో శివుడికి పెరుగు అన్నాభిషేకం, పాలాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో,వైభవంగా నిర్వహించారు.ఉదయం నుండే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా స్వామివారికి గంగాజలం,పాలు,పెరుగు, తేనె,పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

ప్రజావాణికి కొందరు అధికారుల గైర్హాజరు..?



ప్రజాపక్షం/అనంతగిరి: మండల ప్రజలను సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందేందుకు ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం అనంతగిరి మండలంలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు అసౌకర్యంగా మారుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం ఉదయం 11:42 గంటలు దాటిన ఎంపిడివో కార్యాలయంలో కొందరు అధికారులు మాత్రమే హాజరుకాగా, మిగతా శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం. తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందులు వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను అధికారులకు తెలియజేసేందుకు ప్రజలు ఎంతో ఆశతో ప్రజావాణికి వస్తున్నారు. అయితే సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సగరలను బిసి-డి నుండి బిసి-ఎలోకి చేర్చాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నగర ఉప్పర జాతి ఉనికి కోసం పోరాడుతున్నామని సగర సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు నేర్లకంటి రవికుమార్ అన్నారు.సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్ ముందు ధర్నా చేసి,డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్‌కు అందించారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ బీసీడి నుండి బీసీఏలోకి మార్చి,1986లో ఉన్న బీసీఏ సిఫార్సును అమలు చేయాలని డిమాండ్ చేశారు.భగీరథ మహర్షి వంశీ కులమైన తమ జాతి శతాబ్దాలుగా నీటిని పంచిందని,నేడు ఉనికి కోసం అలమటిస్తోందని అన్నారు.ఆధునిక యంత్రాలతో వృత్తి కోల్పోయి 4 లక్షల మంది సగరలు నగరాల్లో దినసరి కూలీలుగా మారారని,95 శాతం మంది పలస వెలుతున్నారని తెలిపారు.బీసీడిలో బలమైన కులాలతో పోటీ పడలేక తమ వాటా 0 శాతానికి చేరిందని, ఇది ఆర్టికల్ 14కు విరుద్ధమన్నారు. వడ్డెరలను బీసీఏలోకి మార్చి నట్లే సగరలను కూడా మార్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బలుగురి కరుణాకర్ సాగర్,కోశాధికారి కోలుగురి ప్రవీణ్ సాగర్,మహిళా అధ్యక్షురాలు నేర్లకంటి వసంత, మాజీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కంచర్ల అంజయ్య సుధాకర్,ఉంగరాల వేమయ్య,గంట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా



ప్రజాపక్షం/రామన్నపేట: పట్టణంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య సందర్శించి రైతులతో కలిసి మార్కెట్ యార్డులో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రారంభించి నెల రోజులు దాటినప్పటికిని ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనీసం మాయిశ్చర్ కూడా తీయడం లేదన్నారు. అంతేకాకుండా రైతులను కావాలని ధాన్యం కొనకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా, సజావుగా సాగాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్, మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, పున్న వెంకటేశం, ఎండి ఆమీర్, జిల్లా నాయకులు బద్దుల రమేష్,ఎస్ కే చాంద్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు బత్తుల వెంకన్న, మిర్యాల మల్లేశం, బొడ్డు ఆహోల్లయ్య, నల్ల స్వామి, చొప్పరి నరసింహ, జెట్టి శివప్రసాద్, ఆవుల శ్రీధర్, చిన్నపాక రమేష్,బైకాని మహేష్, బుర్ర శ్రీశైలం, నక్క నరేందర్, రవ్వ నరసింహ పాల్గొన్నారు.

సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పేరుతో సైబర్ మోసం

ప్రజాపక్షం/రామన్నపేట: రామన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్గా నమ్మబలికి,ఆన్లైన్ ద్వారా రూ.55,000/ నగదు కాజేసిన ఘటనలో ఇద్దరు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులలో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామన్నపేట ఎస్ఐ సతీష్ గోపతి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన బాధితుడు గంట్ల ప్రభాకర్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని నిందితులు తాకూరి మల్లేష్, శ్రీనివాస్ రావులు ఈ మోసానికి పాల్పడ్డారు. నవంబర్14న ఉదయం సుమారు 10 గంటల ప్రాంతంలో బాధితుడికి 8790875631నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి తాను రామన్నపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్గా పరిచయం చేసుకున్నాడు. పోలీసు అధికారిగా నటిస్తూ బాధితుడితో, డబ్బులు అవసరం ఉన్నాయని, వాటిని తీసుకురావడానికి పోలీస్ కానిస్టేబుల్ డైవరును పంపిస్తానని నమ్మబలికాడు. కానిస్టేబుల్ డ్రైవర్ ద్వారా ఆ మొత్తాన్ని నగదు రూపంలో తక్షణమే తిరిగి అందజేస్తానని చెప్పడంతో బాధితుడు నిజమేనని నమ్మాడని, వెంటనే తన ఫోన్ ద్వారా వివిధ మొబైల్ నంబర్లకు మొత్తం రూ.55,000/లను ఆన్లైన్ ద్వారా బదిలీ చేశాడని ఎసై సతీష్ గోపతి తెలిపారు.



నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాపక్షం/చింతపల్లి : నూతన విద్యా విధానం పేరుతో విద్యా వ్యవస్థను నాశనం చేసే విధానాన్ని విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పలు విద్యాసంస్థలలో సోమవారం నూతన విద్యా విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థ పూర్తిగా అభివృద్ధి చెందలేదని, మౌళిక వసతులు కల్పించకపోవడం, టీచింగ్ సిబ్బందిని నియమించకపోవడంతో విద్యావ్యవస్థ నిర్వీర్యం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించి, విద్యను కాషాయికరణ చేయాలని ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని విమర్శించారు. శాస్త్రీయ విద్యారంగంతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. పేదలకు అన్యాయం చేసే విద్యా విధానానికి వ్యతిరేకంగా ఐఎస్ఎఫ్ ఉద్యమాలు నిర్వహిస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివ, జిల్లా కమిటీ నాయకులు శంశొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతత



ప్రజాపక్షం/కోదాడ: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత కలుగుతుందని కోదాడ సబ్ జడ్జి సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం కార్తీక మాసం సందర్భంగా కోదాడ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో జ్యోతిర్లింగాలకు ఆయన దంపతులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ కార్తికమాసం పవిత్రతకు మారుపేరని, ఈ మాసంలో పూజలు చేయడం ఎంతో పుణ్యప్రదమని పేర్కొన్నారు. కార్తీక మాస పుణ్యఫలాలు ప్రజలందరికి కలగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటి ఆధ్వర్యంలో జడ్జి దంపతులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు చల్లా రామ్మూర్తి, ప్రముఖ న్యాయవాది గాలి శ్రీనివాసనాయుడు, కమిటి సభ్యులు బొలిశెట్టి కృష్ణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లతో వెలుగులు

ప్రజాపక్షం/గరిడేపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు వెలుగులు నింపుతున్నదని సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు గుండు రామాంజీగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని రాయినిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇల్లు అనేది ప్రతిపేద వాడి కుటుంబ జీవితకాల స్వప్నం ఆ స్వప్నాని నిజం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు గృహనిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తూ సొంతింటి కలను సాకారం చేసే కార్యక్రమం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఈ యోగి, పంచాయతీ కార్యదర్శి సునిత, వార్డు సభ్యులు గుండు ఉషా, నర్సింహార, గుండు లక్ష్మమ్మ, గురవయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు చేయాలి

ప్రజాపక్షం/మర్రిగూడ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మండలంలోని పలు శాఖల ఉద్యోగులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి లచ్చిరాం మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు.సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,వారి భవిష్యత్తుకు ఎలాంటి భరోసా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.పాత పెన్షన్ విధానం అమలుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



'కోటి సోమవారం' వేడుకలు

ప్రజాపక్షం/రామన్నపేట: కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని మునిపంపుల శివాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో,వైభవంగా నిర్వహించారు. శ్రవణన క్షత్రం,సప్తమి తిథి కలయికతో హరిహరులకు అత్యంత ప్రీతికరమైన రోజును భక్తులు పవిత్రమైన 'కోటి సోమవారం'గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య మాజీ సర్పంచ్ కట్ట యాదయ్య శ్రావణి దంపతులు స్వామివారికి పంచామృతాలతో విశేష రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామపెద్దలు మన్య పద్మా రెడ్డి, ఎంపీటీసీ గాదె పారిజాత, గజ్జల రాము, బాల ఇస్తారి, బూడిద మధు, రవి, గాదె మసూర,లక్ష్మి,కవిత,నాగమ్మ , గ్రామస్తులు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రంగనాయకమ్మ దశదినకర్మలో చామల బ్రదర్స్



ప్రజాపక్షం/మోటకొండూర్: యాదాద్రి భువనగిరి జిల్లా శాలిగౌరారం మండలంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, నానమ్మ చామల రంగనాయకమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు చామల బ్రదర్స్ చామల భానుచందర్ రెడ్డి, ఉదయ్ చందర్ రెడ్డి లు సోమవారం పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళుల ర్పించారు.ఈ కార్యక్రమంలో చామల సురేష్ రెడ్డి, మదు దబ్బికార్ బంధుమిత్రులు, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాపక్షం/రామన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు విద్యావ్యవస్థలో గ్రంథాలయాల పాత్ర అను అంశంపై వ్యాసరచన పోటీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. మూడవ రోజు సోమవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థుల్లో పుస్తక అధ్యయనం పట్ల ఆసక్తిని కలిగించడమే కాకుండా సృజనాత్మక శక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో వారం రోజులపాటు ఆయా పోటీలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డాక్టర్ రాచమళ్ళ శ్రీనుతోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పిహెచ్‌సిలో మహిళా స్టాఫ్ నర్స్‌ను నియమించాలి

ప్రజాపక్షం/రామన్నపేట: మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా స్టాఫ్ నర్స్‌ను తక్షణమే నియమించి మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ గ్రామసర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మునిపంపుల, చుట్టుపక్కల సుమారు 15 గ్రామాల ప్రజలు వైద్య సేవల కోసం ఈ ఆసుపత్రిపై ఆధారపడుతున్నారని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా మునిపంపుల పిహెచ్సిలో మహిళా స్టాఫ్ నర్స్ అందుబాటులో లేకపోవడంతో మహిళా రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గర్భిణీ మహిళలు, బాలింతలు, చిన్నపాటి అనారోగ్య సమస్యలతో



వచ్చే మహిళలు తగిన వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలను స్వేచ్ఛగా వివరించేందుకు మహిళా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్యం అందుబాటులో ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

మండల స్థాయి ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం

ప్రజాపక్షం/తుర్కపల్లి: తుర్కపల్లి మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిని కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఎంపిడిఓ లెంకల గీతారెడ్డి, స్థానిక ఎమ్మార్వో పొదిళ్ళ రవికుమార్ ప్రజలను కోరారు. సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజావాణి జరుగుతుందని అందులో భాగంగా ఆయాగ్రామాల దరఖాస్తుదారుల ద్వారా రెండు ఫిర్యాదులు, ఒక అంత్యోదయా కార్డు దరఖాస్తు తీసుకోవడం జరిగిందని వారు తెలిపారు. అందులో ఇబ్రాహింపురం గ్రామానికి చెందిన (వెన్నుపూస) బాధితుడు బత్తుల సురేందర్ అంత్యోదయా కార్డు ఇప్పించాలని,ఇతర ప్రభుత్వ సహకార పథకాలు అందేలా చూడాలని దరఖాస్తు చేసుకోగా,వీరారెడ్డిపల్లి గ్రామం 207 సర్వేనంబర్



లో అక్రమ నిర్మాణాలు చేపట్టకూడదని రైతులు ఫిర్యాదు చేశారని, తుర్కపల్లి మండల కేంద్రంలోని 213 సర్వేనంబర్ లో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని గ్రామస్తుడు పిడుగు,చీర ఐలయ్య ఫిర్యాదు చేస్తూ దరఖాస్తు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రజావాణి ద్వారా తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి విచారణ చేపట్టి, సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేస్తామని అధికారులు తెలిపారు.

కిటకిటలాడిన మేళ్లచెరువు శైవక్షేత్రం



ప్రజాపక్షం/మేళ్లచెరువు: పవిత్ర కార్తీకమాసం మొదటి సోమవారం (కోటి సోమవారం) పురస్కరించుకుని మేళ్లచెరువులోని శ్రీ ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవస్థానం భక్తజనసంద్రంగా మారింది. పరమశివుడిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు బారులు తీరడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కార్తీకమాసం మొత్తం శివారాధనకు ఎంతో విశేషమైనది. కాగా అందులో వచ్చే మొదటి సోమవారం లేదా శ్రవణ నక్షత్రంతో కూడిన సోమవారాన్ని కోటి సోమవారంగా పరిగణిస్తారు.ఈ పవిత్రమైన రోజున పరమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోటి సోమవారాలు నోచుకున్నంత అనంతమైన పుణ్యఫలం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సాధారణ రోజులతో పోలిస్తే ఈ రోజు చేసే శివ పూజ, రుద్రాభిషేకం, దీపారాధనలకు కోటిరెట్లు అధిక ఫలితం ఉంటుందని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులు తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తం లోనే నది స్నానాలు లేదా చన్నిటి స్నానాలు ఆచరించి జన్మజన్మల పాపాలు తొలగిపోవాలని ఆకాంక్షిస్తూ శివనామస్మరణతో దేవస్థానానికి చేరుకున్నారు. భక్తుల రద్దీతో దేవస్థానంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు, వృద్ధులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చనలు, కార్తీక దీపారాధనను నిర్వహించారు.

అయ్యప్ప మండల కాల దీక్షలు ప్రారంభం

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని అయ్యప్ప దేవాలయంలో సోమవారం మండల కాల దీక్షలు ప్రారంభమయ్యాయి. 27వరకు జరిగే కార్యక్రమాలలో పాల్గొనే భక్తులకు స్వాములకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు రాపోలు రామచంద్రం ట్రస్ట్ చైర్మన్ రాపోలు జ్ఞానేశ్వర్ ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్ జాయింట్ సెక్రటరి భారత లవకుమార్ కోశాధికారి చిరువేరు బాలనర్సింహా బోబ్బల జైపాల్ రెడ్డి జెల్ల వెంకటేశం టై అండ్ డై అధ్యక్షులు కర్నాటి బాలరాజు భక్తులు తదితరులు పాల్గొన్నారు.





పిఎసిఎస్ పాలకవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాపక్షం/అడ్డగూడూరు: పిఏసిఎస్ పాలకవర్గం సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అథిదిగా ఎమ్మెల్యే మందుల సామేలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రజాప్రభుత్వం పెద్దపీట వేసింది అని అన్నారు. అడ్డగూడూరు స్వంత మండల అభివృద్ధికి ప్రాధాన్యత ఉంది అని తెలిపారు. పిఏసిఎస్ చైర్మన్ గా నిమ్మనగోటి జోజి , డైరెక్టర్లుగా పూలపెల్లి సోమిరెడ్డి, మానుపాటి అంజయ్య, జిల్లా నర్సమ్మ, గూడ శ్రీనివాస్, పట్టేటి యాదగిరి, కన్నెబోయిన మంజుల, కడారి నాగరాజు, గజ్జి లింగయ్య, కడారు మధుసూదన్ రెడ్డి, లోడంగి రామచంద్రయ్య, చేడే వెంకన్న, ఎన్నారం అంజయ్య, ప్రమాణస్వీకారం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలపార్టి అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె ముంతల విమల పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే సమ్మెకు సిద్ధం



ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి: ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, లేనిపక్షంలో సమ్మె బాట పడతామని తెలంగాణ ఆశా వర్కర్ల సాధన కమిటీ నాయకులు దాసరి పాండు, రావుల సంతోష హెచ్చరించారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్ల సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వేలాది మంది మహిళలు ఆశా వర్కర్లుగా పనిచేస్తూ గ్రామీణ, పట్టణ ప్రజలకు విశేష సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. మాతాశిశు మరణాల నివారణ, సీజనల్ మరియు దీర్ఘకాలిక వ్యాధుల కట్టడితో పాటు కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి పనిచేశారని గుర్తుచేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో నాయకులు యు. భవాని, అమృత, వాణి, అనిత, సరిత, సుజాత, శోభ, పుష్ప, మల్లేశ్వరి, అలివేలు, సంగీత, సుమలత, చందన, ఎల్లమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థులు

ప్రజాపక్షం/ మోత్కూర్: రాష్ట్రస్థాయి జూడో పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన సాన్విక. రాష్ట్ర జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఖమ్మం జిల్లాలో జూడో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మోత్కూరు కరాటే క్లబ్ కు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొని మెడల్స్ సాధించడం జరిగిందని సీనియర్ జూడో కోచ్ అన్నెపు వెంకట్ తెలిపారు. 28 కేజీల విభాగంలో ఏ.సాన్విక సిల్వర్ మెడల్ సాధించగా సిహెచ్ వీణ, వి. సాయి, సుజిత్ చంద్ర, ఎండి.అబ్దుల్ రెహమాన్ , ప్రశంసా పత్రాలు పొందినారు. రాష్ట్రస్థాయి జూడో పోటీలలో విజయం సాధించిన విద్యార్థులను జూడో ఫౌండర్ పి బాలరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్ట్రక్టర్స్ బి. కార్తీక్ పి. మచ్చేందర్ యు. మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు

